## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 80 మంగళవారం జూలై 21 2026, పేజీలు - 4 వెల :2/-



# తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో

## కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

**-వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం**
**క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన**
**ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ**
**రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి**

హిందుస్థాన్ మీడియా

-తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు.రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.




### ఒకేసారి మూడు నెలల బియ్యం

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## మల్లారెడ్డి గ్రూప్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు

**-నాలుగు రోజులుగా అర్ధరాత్రి వరకు సోదాలు**
**-రంగంలోకి 10 బృందాలు..70 అంశాలపై వివరాల సేకరణ**



హిందుస్థాన్ మీడియా

మల్లారెడ్డి రెడ్డి గ్రూప్‌నకు చెందిన ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో పాటు పలు ప్రైవేటు యూనివర్సిటీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు లీగల్, ఆడిట్, ఫైనాన్స్, రెవెన్యూ అధికారులతో పాటు జేఎన్‌టీయూ ఆచార్యులతో కలిపి మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈనె 17 నుంచి ప్రారంభమైన ఈ తనిఖీలు మల్లారెడ్డి కాలేజీలతో పాటు వాటి అనుబంధ కాలేజీలుగా భావిస్తున్న సీఎంఆర్, ఎంఎల్‌ఆర్‌ఐటీ, అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ముమ్మరంగా కొనసాగుతున్నట్లు సమాచారం. గతంలో జేఎన్‌టీయూ నిర్వహించిన సాధారణ ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు భిన్నంగా, ఈసారి సుమారు 70 రకాల అంశాలతో కూడిన ఫార్మాట్‌లో కాలేజీ వివరాలను సేకరిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు (కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు) అధికారుల బృందాలు కాలేజీల్లోనే ఉండి పరిశీలిస్తున్నాయి. ఒకవైపు విద్యా సంవత్సరం ప్రారంభమై బీటెక్ 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సుమారు 30 మంది జేఎన్‌టీయూ ఆచార్యులను ఈ తనిఖీల కోసం ప్రైవేటు కాలేజీలకు పంపడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## కమీషన్ల డబ్బు బావమరిది ఖాతాల్లో జమ

**-ప్రభుత్వ ఖజానాకు రూ.192 కోట్ల నష్టం**
**-సిట్ 37 పేజీల రిమాండ్ రిపోర్టులో వెల్లడి**

హిందుస్థాన్ మీడియా



గత ప్రభుత్వంలో రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి వ్యవహరించినప్పుడు మద్యం రవాణా టెండర్ల నిబంధనలను అడ్డగోలుగా మార్పు చేశారని సిట్ కోర్టుకు తెలిపింది. అనుకూల సంస్థలకు టెండర్లు ఇచ్చి వాటి ద్వారా కమీషన్ల రూపంలో వచ్చే నగదును తన బావమరిదికి చెందిన వ్యాపార సంస్థల ఖాతాలకు మళ్లించినట్టు సిట్ గుర్తించింది. లిక్కర్ రవాణా టెండర్లలో జరిగిన గోల్‌మాల్‌లో వాసుదేవరెడ్డి, కారుమూరి సునీల్, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాత్రను సోమవారం సిట్ అధికారులు 37 పేజీల రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. ప్రభుత్వ విధానాలను పక్కనబెట్టి టెండర్లను ముందే కుదుర్చుకుని, కమీషన్ల రూపంలో కోట్లాది రూపాయలను మళ్లించారని దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది. విజయవాడకు చెందిన రేపాకుల సాయి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక విచారణ చేపట్టింది. విచారణలో అధిక మొత్తంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు బయటపడింది. వాసుదేవరెడ్డి బావమరిది మారెళ్ల విజయ నరసింహారెడ్డికి చెందిన శ్రీలక్ష్మీ నరసింహ మిల్క్ కంపెనీ, పెట్రోలు బంక్‌కు చెందిన ఖాతాలకు డబ్బును బదిలీ చేశారు.

### జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి

2019 ఎక్సైజ్ విధానం ప్రకారం జిల్లాస్థాయి కమిటీలు నిర్ణయించాల్సిన రవాణా చార్జీలను వాసుదేవరెడ్డి ఏకపక్షంగా రాష్ట్ర స్థాయికి మార్చారు. హమాలీల సమ్మెను కారణంగా చూపించి దీనికి ప్రభుత్వ అనుమతి తీసుకోలేదు. ఈ నిర్ణయం వల్లే కాంట్రాక్టర్లకు అనుకూలంగా రేట్లు పెరిగి, ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లినట్లు తేలింది. ముందుగా ఒక్కో కార్టన్ బాక్స్ రవాణాకు కిలోమీటరుకు రూ.19.68 అయ్యేది. కొత్త విధానంలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్‌కు రూ.32.53, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.35.30 నుంచి రూ.35.90 వరకు చెల్లించారు. ప్రతి కార్టన్‌పై రూ.13 నుంచి రూ.16 వరకు అదనపు చెల్లింపులు జరిగాయి. దీంతో కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు లాభంగా మళ్లించారు. ప్రభుత్వ ఖజానాకు రూ.192 కోట్ల నష్టం కలిగేలా చేశారు. ఫైనాన్స్ విభాగం, బోర్డు సభ్యులు ఈ పెంపుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా వాసుదేవరెడ్డి మౌఖిక ఆదేశాలతో ఫైళ్లను ముందుకు నడిపించారు. టెండర్ నోటిఫికేషన్ విడుదలకు ముందే డ్రాఫ్ట్ పత్రాలు సిద్ధం చేసి కాంట్రాక్టర్లకు తెలియజేశారు. 2020 జూలైలో టెండర్ డ్రాఫ్ట్ సిద్ధమవగా, సెప్టెంబరులో అధికారిక ప్రకటన విడుదల చేశారు. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్టు సంస్థలకు కాంట్రాక్టులు దక్కేలా టెండర్ నిబంధనలను మార్పు చేశారు. పోటీ ఉందని ఇతరులను నమ్మించడానికి బినామీ కంపెనీల పేర్ల మీద టెండర్లు దాఖలు చేశారు. కారుమూరి సునీల్‌కు చెందిన సిగ్మా సంస్థతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారు. టెండర్ ప్రకటనకు ముందే పంపిన ఈ-మెయిల్ ద్వారా సిగ్మా సంస్థ పేరు మీద టెండర్ వేసి, అసలు కార్యకలాపాలను స్థానిక భాగస్వామి నిర్వహించేలా చేశారు. లాభాల్లో సునీల్ 4 శాతం, వాసుదేవరెడ్డి 96 శాతం పంచుకున్నారు. వసూలు చేసిన కమీషన్లను షెల్ కంపెనీల ద్వా రా మళ్లించారు. నకిలీ బిల్లులు సృష్టించారు. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్, ఈజీలోడ్, కాస్తా పింక్, హైజీన్ ఈకో ఆర్గానిక్స్ వంటి వాటిని నిధుల మళ్లింపునకు ఉపయోగించుకున్నారు.

## కొత్త ఉద్యోగ ఆరోగ్య పథకం మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

**-40 ఏళ్లు దాటితే ఏటా ఉచిత ఆరోగ్య పరీక్షలు**
**-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా నిర్వహణ**
**-ఓపీ సేవలపై 50 శాతం రాయితీ.. రూ.5 లక్షల వరకు నాన్- ప్యాకేజీ చికిత్స**
**-943 ఎంపానెల్ ఆస్పత్రులు.. విజయవాడ, కర్నూలులోనూ సేవలు**
**-కుమారులకు 25 ఏళ్ల వరకు, కూతుళ్లయితే వివాహం అయ్యేవరకు వర్తింపు**
**-సీజీహెచ్‌ఎస్ నమూనాలో నగదు రహిత చికిత్సలు**

హిందుస్థాన్ మీడియా

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రూపొందించిన నూతన ఉద్యోగ ఆరోగ్య పథకం (ఎన్‌ఈహెచ్‌ఎస్) మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) తరహాలో ఎన్‌ఈహెచ్ ఎస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్త పథకం కింద 40 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులకు ఏటా ఉచితంగా సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. పాత పథకం ఈహెచ్‌ఎస్ ఎంపానెల్‌లో 435 ఆస్పత్రులు మాత్రమే ఉండగా, కొత్త పథకంలో 943 ఆస్పత్రులను చేర్చారు. పాత పథకంలో నాన్ ప్యాకేజీ వైద్య సేవల పరిమితి రూ.2 లక్షల వరకే ఉండగా, తాజాగా పథకంలో రూ.5 లక్షలకు పెంచారు.

### ఇవీ మార్గదర్శకాలు..

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఈ పథకం కిందికి వస్తారు. మోడల్ స్కూళు ,, గురుకుల, రెసిడెన్షియల్, ఎయిడెడ్ విద్యాసంస్థలు, మార్కెట్ కమిటీలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ గ్రంథాలయాల ఉద్యోగులను కూడా ఈ పథకం పరిధిలోకి తెచ్చారు. భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని ప్రభుత్వ అనుబంధ సంస్థలను కూడా చేర్చుతారు. ఉద్యోగి భార్య లేదా భర్త, వారిపై ఆధారపడిన పిల్లలు, తల్లిదండ్రులు, దత్తత పిల్లలు ఈ పథకానికి అర్హులు. నిరుద్యోగ కుమార్తె వివాహం అయ్యే వరకు.. అలాగే వితంతువు, విడాకులు పొందిన లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తె కూడా ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు. నిరుద్యోగ కుమారుడికి 25 ఏళ్లు వచ్చేవరకు ఈ పథకం కింద వైద్యం పొందే అవకాశం ఉంది. శాశ్వత వికలాంగ పిల్లలకు వయోపరిమితి వర్తించదు. క్యూఆర్ కోడ్ ఆధారిత ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డులను జారీచేస్తారు. ఉద్యోగులు మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్‌ఈహెచ్‌ఎస్‌తో పాటు ఇతర ప్రభుత్వ డేటాబేసేలతో అనుసంధానం చేసి ఉద్యోగుల వివరాలను ధ్రువీకరిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న విధంగానే ఇందులో చికిత్స ప్యాకేజీలు, ధరలు, వైద్య ప్రమాణాలు ఉంటాయి. ప్యాకేజీలో పేర్కొన్న చికిత్సలకు ఆస్పత్రులు అదనపు చార్జీలు వసూలు చేయడానికి వీలు లేదు. ఇప్పటివరకు రూ.2 లక్షల వరకు మాత్రమే ఉన్న వైద్య సేవల ఖర్చు పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. అంతకు మించితే హెల్త్‌కేర్ ట్రస్టు బోర్డు అనుమతితో నగదు రహిత సేవలు కొనసాగుతాయి. ప్రస్తుత ఈహెచ్‌ఎస్ లో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులో లేవు. కొత్త పథకంలో ఎంపానెల్ ఆస్పత్రుల్లో ఓపీడీ కన్సల్టేషన్, ల్యాబ్ పరీక్షలపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా సాధారణ వైద్య ్ససవలు, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ, మందుల పంపిణీ, ల్యాబ్ పరీక్షలు, ఆయుర్వేదం, యోగా వంటి భారతీయ వైద్య విధానాలకు కూడా అవకాశం కల్పించారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఉద్యోగికి సంవత్సరంలో ఒకసారి పూర్తిస్థాయి మాస్టర్ హెల్త్ చెక్‌పను ఉచితంగా నిర్వహిస్తారు. ప్రస్తుతం ఈహెచ్‌ఎస్ కింద ఉన్న 435 ఆస్పత్రులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకంలోని 508 ఆస్పత్రులను కలిపి మొత్తం 943 ఆస్పత్రులతో కూడిన నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. విజయవాడ, కర్నూలు వంటి ప్రాంతాల్లో కూడా కొత్త ఆస్పత్రులను ఎంపానెల్ చేయనున్నారు. ఈ పథకానికి ఉద్యోగి, పెన్షనర్ తనమూల వేతనంలో 1.5 శాతం చందాగా చెల్లించాలి. అంతేమొత్తాన్ని ప్రభుత్వం కూడా ట్రస్టుకు జమ చేస్తుంది. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు లేదా పెన్షనర్లు అయితే ఒకరి ఖాతా నుంచే చందా చెల్లిస్తే సరిపోతుంది. నెలకు రూ.1,000 వరకు చందా చెల్లించే వారికి ఆస్పత్రిలో సెమీ ప్రైవేట్ గది, అంతకంటే ఎక్కువ చెల్లించే వారికి ప్రైవేట్ గది సౌకర్యం ఉంటుంది. కొత్త పథకం నిర్వహణ కోసం ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్టు (ఈహెచ్‌సీటీ)ను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల చందా, ప్రభుత్వ సమాన వాటా, ఇతర నిధులన్నీ నేరుగా ట్రస్టు ఖాతాలోనే జమ అవుతాయి. ట్రస్టు లెక్కలను కాగ్ లేదా ప్రభుత్వం నియమించిన ఆడిట్ సంస్థ పరిశీలిస్తుంది. లబ్ధిదారుల నమోదు నుంచి ఆస్పత్రిలో చేరిక, క్లెయిమ్ సెటిల్‌మెంట్, చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్‌గా నిర్వహిస్తారు. నకిలీ క్లెయిమ్‌లు, అనవసర చికిత్సలు, అధిక బిల్లింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక సాంకేతిక, ఫార్మా కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఆస్పత్రి స్థాయి నుంచి ఈహెచ్‌సీటీ బోర్డు వరకు నాలుగు దశల్లో ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి ఫిర్యాదుకు ట్రాకింగ్ నంబర్ ఉంటుంది. అత్యవసర చికిత్సలు, ఎంపానెల్ కాని ఆస్పత్రుల్లో చేరిక వంటి అంశాలకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఉంటుంది. ప్రస్తుత ఈహెచ్‌ఎస్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడతల వారీగా చెల్లిస్తారు. అయితే, పాత బకాయిల పరిష్కారం పేరుతో కొత్త పథకం అమలును ఆలస్యం చేయ రాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త పథకం అమలులో ఈహెచ్‌సీటీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆర్థిక శాఖ, ఆరోగ్య శాఖ, ట్రెజరీ శాఖ, జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల అధిపతులు, డీడీవోలు, పీపీవోలు, ఎంపానెల్ ఆస్పత్రులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది.



# అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు యువజన సంఘాల నిరసన



హిందుస్థాన్ మీడియా, ఇల్లంతకుంట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేస్తూ మండల యువజన సంఘాల నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పట్టాలు పంపిణీ చేసి దాదాపు పది నెలలు గడిచినా ఇప్పటికీ నీటి సరఫరా, డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంకులు, తలుపులు, కిటికీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. దీంతో లబ్ధిదారులు ఇప్పటికీ అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి వచ్చిన ప్రతిసారి ఎమ్మెల్యేకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కనిపిస్తున్నప్పటికీ నిధులు కేటాయించి పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వెంటనే నిధులు విడుదల చేసి 30 రోజుల్లో పనులు పూర్తి చేసి శ్రావణ మాసంలో లబ్ధిదారులకు గృహప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో మండల యువజన సంఘాల అధ్యక్షుడు ఛేంద్రం తిరుపతి రెడ్డి, నాయకులు బొల్లారం ప్రసన్నకుమార్, బొల్లం రాంసాగర్, అంతగిరి అనిల్, భూమల్ల ప్రశాంత్, ఎల్లేని శ్రీనివాస్, రొండ్ల కరుణాకర్ రెడ్డి, గుగ్గిళ్ల అంజనేయులు, చిట్యాల శ్రీనివాస్, దుది శ్రీనివాస్, కేశవేని భూమేష్, ఉప్పులేటి ప్రశాంత్, ఓరుగంటి చింటూ, కొట్టేపెల్లి చందు, గొర్రె శ్రీనివాస్, బిగుళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేలో 36 ఫిర్యాదులు స్వీకరణ

-బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యం:

-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే




హిందుస్థాన్ మీడియా, రాజన్న సిరిసిల్ల:

ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 36 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడిన ఎస్పీ, ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం చూపేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

-అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

హిందుస్థాన్ మీడియా, రాజన్న సిరిసిల్ల:



ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో మొత్తం 175 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించేందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. అలాగే ప్రతి సోమవారం సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో కూడా నిర్వహిస్తున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో 6, వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో 4 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. లక్ష్యాల సాధనకు చేరువగా ఉండాలి

-విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి:

-సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

-(రవీందర్ గౌడ్ -రిపోర్టర్ )

రాజన్న సిరిసిల్ల, హిందుస్థాన్ మీడియా:






యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తు కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడాలని రాజన్న సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి పిలుపునిచ్చారు. సోమవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కళాశాలలో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణతో తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తన, కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచి, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్: 8712671111కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డీఎస్పీ ఉపేందర్, ఎస్ఐ ఉపేందర్ చారి, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

-సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల ధర్నా..

రూ.5,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్

హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:



మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం (TMKMKS) ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఇఖీజూ డైరెక్టర్, ఎవీఖవీఖూ కన్వీనర్ తేలు ఇస్తారి మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లాలోని జలవనరులకు అవసరమైన చేప, రొయ్య పిల్లల పంపిణీకి బదులుగా ఆ నిధులను నేరుగా సొసైటీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రమాదాల్లో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, చెరువుల్లోని ముళ్ల పొదలు, కంప, రాళ్లను తొలగించి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

-మత్స్యకారుల ప్రధాన డిమాండ్లు

ఉచిత చేప, రొయ్య పిల్లల పథకాన్ని పునరుద్ధరించి నగదును సొసైటీల ఖాతాల్లో జమ చేయాలి. ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి. ప్రతి మత్స్యకారుల సొసైటీకి రూ.20 లక్షలతో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి. ప్రతి మండల కేంద్రంలో మత్స్య మార్కెట్లు ఏర్పాటు చేయాలి. సిద్దిపేట పాత మత్స్య అభివృద్ధి కార్యాలయ స్థలాన్ని జిల్లా మత్స్యకారుల ఫెడరేషన్‌కు కేటాయించాలి. శనిగరం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలి. రిజర్వాయర్ల వద్ద ఇరిగేషన్ భూములను సీడ్ ఉత్పత్తి కేంద్రాల కోసం కేటాయించాలి. మల్లన్నసాగర్ వద్ద 60 ఎకరాల్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలి. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు కేటాయించాలి. 50 ఏళ్లు పూర్తి చేసిన మత్స్యకారులకు పెన్షన్ మంజూరు చేయాలి. మత్స్యకారుల పిల్లల కోసం ప్రత్యేక వసతి గృహాలతో కూడిన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే జిల్లాలోని 379 మత్స్యకారుల సొసైటీలను చైతన్యపరచి భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ ఆలేటి యాదగిరి, TMKMKS జిల్లా నాయకులు ప్రశాంత్, చింతల రమేష్, అరవింద్, నర్సింలు, కొంతం రాజు, రుద్రారం స్వామి, పెద్దిరాజు, కనకయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలి

-రేషన్ డీలర్లతో జిల్లా డీసీఎస్‌వో సమీక్ష సమావేశం

హిందుస్థాన్ మీడియా:



రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయించాలని జిల్లా డీసీఎస్‌వో రేషన్ డీలర్లకు ఆదేశించారు. సోమవారం నాలుగు మండలాల రేషన్ డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు సూచనలు చేశారు. ప్రతి రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లల ప్రత్యేక జాబితా, మరణించిన రేషన్ కార్డుదారుల జాబితా, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి జాబితా సిద్ధం చేసి సమర్పించాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హులందరికీ రేషన్ సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు

## విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పీడీని, నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ

హిందుస్థాన్ మీడియా, బెజ్జంకి:



బెజ్జంకి మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పీడీపై వెంటనే సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపిన ఆయన, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థలు విద్యార్థులకు భద్రత, క్రమశిక్షణ, విలువలు నేర్పించే కేంద్రాలుగా ఉండాలని, అలాంటి చోటే విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై ప్రభుత్వం ఆదర్శప్రాయమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ప్రవర్తన, విద్యార్థుల భద్రత, పాఠశాలల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఇటువంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే స్పందించి బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 24 గంటల్లో పీడీ, ప్రిన్సిపాల్‌లపై సస్పెన్షన్ చర్యలు తీసుకోకపోతే తల్లిదండ్రులతో కలిసి మోడల్ స్కూల్ ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని, అనంతరం కూడా స్పందించకపోతే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనను ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ హెచ్చరించారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై వికలాంగుల ఫైర్

-ఆహార భద్రత చట్ట సవరణలు విరమించుకోవాలి: ఎన్‌పీఆర్‌డీ

హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:




జాతీయ ఆహార భద్రత చట్టంలో ప్రతిపాదిత సవరణలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సలహా మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌పీఆర్‌డీ (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక) చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ చేర్యాల డివిజన్ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్ మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులో ఉన్న అంత్యోదయ రేషన్ కార్డు ద్వారా కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల బియ్యం అందుతోందని, దీనివల్ల వికలాంగులు, పేద కుటుంబాలకు ఆహార భద్రత కలుగుతోందన్నారు. అయితే ప్రతి వ్యక్తికి 7 కిలోల బియ్యం మాత్రమే అందించేలా కేంద్ర ప్రభుత్వం సవరణలు చేయాలని భావించడం వికలాంగుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా అర్హులైన వికలాంగులు, పేదలకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. 2016 ఆర్‌పీడీ (వికలాంగుల హక్కుల) చట్టం ప్రకారం రాష్ట్ర వికలాంగుల సలహా మండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి (ఇబొ) సిద్దిపేట జిల్లాలోని వికలాంగులందరితో సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాలోని వికలాంగులను ఏకం చేసి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ ఉపాధ్యక్షుడు తాండ్ర సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బయ్యారపు ఆంజనేయులు, భద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# అంతర్జాతీయ ఉద్రిక్తతల ఎఫెక్ట్.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**
**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్ల అప్రమత్తత**
**443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 96 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**
**బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**
**లాభాల్లో ముగిసిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు**



అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితికి తోడు, దేశీయంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 443 పాయింట్లు నష్టపోయి 77,708.52 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 96 పాయింట్లు క్షీణించి 24,238.50 వద్ద ముగిసింది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,300--24,400 జోన్ తక్షణ నిరోధకంగా కొనసాగుతోంది. ఈ స్థాయిని నిలకడగా అధిగమిస్తేనే బుల్స్ పట్టు సాధించి, సూచీ 24,500--24,600 స్థాయిల వైపు పయనించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సూచీ కిందకు వస్తే, 24,100 వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని, ఈ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ పెరిగి 24,000 సైకలాజికల్ మార్క్ వరకు పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. సెషన్ మొత్తంలో బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్ మాత్రం రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.6 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు తీవ్రంగా నష్టపోగా, నిఫ్టీ ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తొమ్మిదో రోజుకు చేరడం, ముఖ్యంగా హార్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు కేంద్రీకృతమవ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు.

## ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?.. అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు. దమ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు.

అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు

**ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం**
**ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు**
**ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు**
**గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు**
**మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు**



చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్రీశ్రీ.ఏశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ దర్హమ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు. "ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని దర్హమ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

# క్రీడలు

## అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే... పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు



ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్ భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు. "2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

# ‘గేదెలరాజు’ (ఆహా) మూవీ రివ్యూ!



నటుడిగా .. గాయకుడిగా .. సంగీత దర్శకుడిగా రఘు కుంచెకి మంచి పేరు ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్రలను ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. ముఖ్యంగా విలేజ్ నేపథ్యంలోని సినిమాలలో ఆయన ఎక్కువగా కనిపిస్తున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘గేదెల రాజు’ - కాకినాడ తాలూకా అనేది ట్యాగ్. ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 17వ తేదీ నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. క్రైమ్ డ్రామా జోనర్లో తెరకెక్కిన ఈ సినిమా ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం.‘కాకినాడ’ పరిసర ప్రాంతాలలో ‘భగవాన్ రాజు’ అలియాస్ ‘గేదెల రాజు’ (రఘు కుంచె) తెలియని వారంటూ ఉండరు. ఊళ్లో పనీపాటా లేని కుర్రాళ్లంతా అతని అనుచరులే. డబ్బు .. అమ్మాయిలపై అతనికి వ్యామోహం ఎక్కువ. అందువలన ఆడపిల్లల తల్లిదండ్రులు భయంతో బ్రతుకుతుంటారు. తన రౌడీయిజానికి రాజకీయం కూడా తోడైతే బాగుంటుందని భావించిన గేదెలరాజు’, ముందుగా కార్పొరేటర్ కావాలని కంకణం కట్టుకుంటాడు. ఈ విషయంలో అతనికి ‘దుర్గ’(శ్రీకాంత్ అయ్యంగార్) అడ్డుపడుతుంటాడు. గేదెల రాజు - దుర్గ ఇద్దరూ ఒకప్పుడు మంచి స్నేహితులు. కొన్ని కారణాలు వాళ్లను శత్రువులుగా మారుస్తాయి. ‘దుర్గ’ సంపాదన అంతా కిరాయికి తిరుగుతున్న అతని బోట్లపైనే ఆధారపడి ఉంటుంది. తన వ్యాపారానికి ఎదురులేకుండా ఉండటం కోసం అతను అధికారం కోసం పాకులాడుతుంటాడు. గేదెల రాజుకి వ్యతిరేకంగా తన అనుచరుల సంఖ్యను పెంచుతూ ఉంటాడు. తానే కార్పొరేటర్ కావాలనే పట్టుదలతో ఉంటాడు. అందుకు సంబంధించిన ప్రయత్నాలు గట్టిగానే చేస్తుంటాడు. ఇక ఆ ఊళ్లో ఎక్కువగా వినిపించే పేరు ‘రిచ్’. చెల్లెలు ‘దివ్య’ అంటే అతనికి చాలా ఇష్టం. దివ్య స్నేహితురాలైన ‘మీరా’ (మౌనిక)ను అతను ప్రేమిస్తూ ఉంటాడు. అలాగే ‘మల్లవరం’ గ్రామానికి చెందిన మరో ప్రేమజంటగా విజయ్ - సత్య (టీనా శ్రావ్య) కనిపిస్తారు. ఈ ఇద్దరూ ఒక హాస్పిటల్లో పనిచేస్తుంటారు. భర్తను కోల్పోయిన మీరా తల్లి, గేదెలరాజుతో అక్రమ సంబంధం కొనసాగిస్తూ ఉంటుంది. మరో వైపున సత్యతో పాటు ఆమె ఆస్తిపై కూడా గేదెల రాజు కన్నేస్తాడు. గేదెలరాజు తమ్ముడు ‘శ్యాంబాబు’ అన్నచేసే అరాచకాలకు నాయకత్వం వహిస్తుంటాడు. అయితే అన్నయ్య చేస్తున్న పెత్తనానికి తాను వారసుడిని కావాలనే ఒక బలమైన కోరిక అతనిలో ఉంటుంది. ఇక గతంలో గేదెలరాజుతో కలిసి పనిచేసిన శివయ్య, అతని కారణంగా జైలు జీవితం గడిపొస్తాడు. అప్పటి నుంచి గేదెలరాజుపై ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యలోనే గేదెలరాజు హత్య జరుగుతుంది. అతణ్ణి చంపింది ఎవరు? ఈ కేసు ఇన్వెస్టిగేషన్ లో తేలే నిజాలేమిటి? అనేది కథ. కాకినాడ పరిసర గ్రామాలు .. అక్కడి రాజకీయాలు .. పదవుల కోసం పడే పోటీలు .. అక్రమ వ్యాపారాలు .. ముఠాకక్షలు .. సాధారణ ప్రజలతో పాటు, వాటి బారినపడే ప్రేమికుల చుట్టూ తిరిగే కథ ఇది. మొదటి నుంచి చివరి వరకూ గ్రామాలు .. అక్కడి పరిస్థితులను కలుపుకుంటూ ముందుకు సాగుతుంది. ఒక వైపున గేదెల రాజు హవా కొనసాగడాన్ని చూపిస్తూ, రెండు జంటలకు సంబంధించిన ప్రేమకథలలో కదలిక తీసుకొచ్చారు. సాధారణంగా ఏ కథలోనైనా హీరో - విలన్ ఇద్దరూ ఉంటారు. కానీ ఈ కథలో హీరో - విలన్ ఇద్దరూ ఒక్కరే .. అతనే గేదెలరాజు. కథలో పవర్ఫుల్ గా కనిపించే పాత్ర .. ప్రధానమైన పాత్ర ఏదైతే ఉంటుందో, ఆ పాత్రకి చివరి వరకూ ఏమీ కాదు. ఒకవేళ ఏదైనా జరిగితే అక్కడి నుంచి ఆ కథను ముందుకు నడిపించడం చాలా కష్టమైన విషయం. కానీ ఈ కథలో అందుకు భిన్నంగా జరుగుతుంది. ప్రధానమైన పాత్రగా కనిపించే ‘గేదెలరాజు’ హత్యతోనే ఈ కథ మొదలవుతుంది.గేదెలరాజు చాలా బలవంతుడు, డబ్బు - పలుకుబడి - మందీ మార్బలం ఉన్నవాడు. అలాంటి అతణ్ణి ఎవరు చంపేసి ఉంటారు? అనే దిశగానే ఈ కథ తన ప్రయాణాన్ని మొదలుపెడుతుంది. ఓ ఇరవైఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్లి, అక్కడి నుంచి గేదెలరాజు లీలా విశేషాలను మనకి చూపిస్తూ రావడం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే అతని శత్రువులు .. అతనితో ముడిపడిన ప్రేమకథలు తెరపైకి వస్తాయి. గేదెలరాజును ఎవరు చంపేసి ఉంటారు? అనే అంశమే ఆడియన్స్ లో ఉత్కంఠను రేపుతుందని దర్శకుడు భావించి ఉండొచ్చు. అయితే అసలైన గేదెలరాజే చనిపోయిన తరువాత మిగతా కథను తెలుసుకోవడానికి ప్రేక్షకులలో ఎక్కువమంది అంత సిద్ధంగా ఉండకపోవచ్చు. సినిమాల వరకూ చూసుకుంటే, చనిపోయిన ఒక వ్యక్తి తాలూకు హీరోయిజాన్ని .. విలనిజాన్ని ఎంత గొప్పగా చూపించినా ఆశించినస్థాయి ప్రయోజనం ఉండకపోవచ్చునేమో. విలేజ్ నేపథ్యంలో ‘గేదెల రాజు’ పాత్రను డిజైన్ చేసుకున్న తీరు చాలా బాగుంది. అయితే ఆయన ప్రధాన శత్రువులైన దుర్గ .. శివయ్య పాత్రలను అంత సమర్థవంతంగా మలచలేకపోయారు. ఇక రెండు ప్రేమ జంటలకు సంబంధించిన ట్రాక్ కూడా అంత బలంగా అనిపించదు. ఇందుకు సంబంధించిన సన్నివేశాల ఆవిష్కరణపై ఇంకాస్త కసరత్తు చేయవలసిందేమో అనిపిస్తుంది. నేరం ఎవరు చేశారు? అనే కోణంపై ఆడియన్స్ లో ఆసక్తి పెరగాలంటే, ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు ఒక రేంజ్ లో ఉండాలి. కానీ ఈ ట్రాక్ కూడా బలహీనంగానే కనిపిస్తుంది. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ పాత్ర చాలా వీక్ గా అనిపిస్తుంది. చాలా ముఖ్యమైన ఈ పాత్ర విషయంలో కేర్ తీసుకోవాల్సింది. కొన్ని పాత్రలకి జరిగిన ఆర్టిస్టుల ఎంపిక చూస్తే రాంగ్ ఛాయిస్ అని కూడా అనిపిస్తుంది. ‘రిచ్’ వంటి పేర్లు పిలవడం .. పలకడం కూడా కష్టమేనని గ్రహించాలి. కుంచె రఘు యాక్టింగ్ బాగుంది. ‘గేదెలరాజు’ పాత్రలో ఆయన మెప్పించాడు. ఆయన స్వరపరిచిన ఒక మెలోడీ బాగుంది. నేపథ్య సంగీతం అక్కడక్కడా కాస్త ఇబ్బంది పెడుతుంది. ఇక మిగతా పాత్రలేవీ అంతగా ప్రభావితం చేయలేదు. ఆ స్థాయిలో డిజైన్ చేసే ప్రయత్నాలు జరగలేదు. ఫొటోగ్రఫీ .. ఎడిటింగ్ ఫరవాలేదు. కథలో అనవసరమైన సన్నివేశాలు .. అవసరానికి మించిన పాత్రలు కూడా కనిపిస్తాయి.

## నాకు, అఖిల్, చైతన్యకి పండగలా ఉంది.. ఇల్లంతా కళకళలాడుతూ ఉంది: నాగార్జున

అక్కినేని అఖిల్ ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భారీ విజయం ‘లెనిన్’ రూపంలో వరించింది. ఈ ఆనందాన్ని పంచుకునేందుకు సోమవారం నాడు ‘బ్లాక్ బస్టర్ వైభవం’ పేరుతో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ ఒకే వేదికపై కనిపించి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఈ విజయం తమ కుటుంబంలో పండగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని నాగార్జున భావోద్వేగంతో చెప్పగా, తమ్ముడి విజయాన్ని చూసి ఓ అన్నయ్యగా, అభిమానిగా గర్వపడుతున్నానని నాగ చైతన్య అన్నారు. ఈ వేడుకలో డిస్ట్రిబ్యూటర్లకు, చిత్ర బృందానికి షీల్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. “చాలా కాలం తర్వాత డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లను పిలిచి ఇలా షీల్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రతిచోటా హౌస్ ఫుల్స్ పడుతున్నాయని ఫోన్లు వస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీకు (అభిమానులకు) ఎలా ఉందో తెలీదు కానీ, నాకు, అఖిల్, చైతన్యకు మాత్రం ఇంట్లో పండగలా ఉంది. ఇల్లంతా కళకళలాడుతోంది. ఈ ప్రేమ కోసం, ఈ అరుపుల కోసమే అఖిల్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాడు. ఆ ప్రేమను ప్రేక్షకులు, అభిమానులు తిరిగి చూపించారు. రైటర్ సత్యానంద్ గారు ఇచ్చిన ఇన్‌పుట్స్, అన్నపూర్ణ పోస్ట్ ప్రొడక్షన్ టీమ్ కష్టం ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండు వారాల ముందే సినిమాను పోస్ట్ ప్రొడక్షన్‌కు ఇస్తే అద్భుతమైన అవుట్‌పుట్ వస్తుంది. అందరూ ఈ విషయాన్ని గమనించాలి” అని అన్నారు. నాగ చైతన్య మాట్లాడుతూ.. “తమ్ముడు కాస్త లేట్‌గా వచ్చినా, అభిమానులు మాత్రం లేటెస్ట్‌గా సపోర్ట్ చేశారు. కథ విన్నప్పుడే అఖిల్ సక్సెస్ కొట్టాడని ఫిక్స్ అయ్యాను. ‘లెనిన్’ పాత్రకు, అఖిల్‌కు ఎలాంటి సంబంధం ఉండదు. కానీ ఆ పాత్ర కోసం తను పూర్తిగా మారిపోయాడు. ఓ అన్నయ్యగా, అభిమానిగా అఖిల్‌ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నాన్నగారి ఫైర్ ఎలాంటిదో నాకు, అఖిల్‌కు బాగా తెలుసు. ‘శివ’, ‘అన్నమయ్య’, ‘నిన్నే పెళ్లాడతా’ వంటి చిత్రాలను ఆయన ఎంత డేరింగ్‌గా తీశారో, ‘లెనిన్’ విషయంలోనూ అదే డేరింగ్ చూపించారు. ఒక హీరోని ఎలా ప్రొజెక్ట్ చేయాలో నిర్మాత నాగవంశీకి బాగా తెలుసు. తమన్ తన సంగీతంతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. నా బేబీ సిసింద్రీకి ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు” అని తన ఆనందాన్ని పంచుకున్నారు. హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. “ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మాట్లాడాం. విడుదలైన రెండో రోజు నుంచే థియేటర్లు పెంచి మాకు మద్దతుగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్లకు థాంక్స్. కేవలం మూడు రోజుల్లోనే మా సినిమా బ్రేక్ ఈవెన్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ, మా కోసం వచ్చిన అక్కినేని అభిమానులకు, అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు” అని తెలిపారు. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ‘లెనిన్’ చిత్రానికి మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు. జూలై 10న విడుదలై ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసుకుని, విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455